

ఓమ్ శ్రీ హరిహర హిరణ్యగర్భేభ్యో నమః

# శ్రీ శాంకర సూక్తమ్

( ఆదిశంకరులు రచించిన ప్రాచీన స్తోత్రముల సంకలనము)

మొదటి భాగము

ఇందులో....


1. శ్రీవిష్ణుపదీస్తోత్రమ్
2. శ్రీజగన్నాథాష్టకమ్
3. శ్రీమదర్ధనారీశ్వరస్తోత్రమ్
4. శ్రీలలితా పంచరత్నమ్
5. శ్రీభవానీ భుజంగప్రయాత స్తోత్రమ్
6. శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్
7. గంగాష్టకమ్
8. శ్రీ శివపంచాక్షరీ స్తోత్రమ్
9. శ్రీకృష్ణాష్టకమ్


(తాత్పర్య రచన : తాడేపల్లి బాలసుబ్రహ్మణ్యం)


: ప్రచురణ :

కామన్ తెలుగు ఇంప్రెషన్స్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్

హైదరాబాదు

2006

# 1. శ్రీ విష్ణు షట్పదీ స్తోత్రమ్

శ్లో॥ అవినయ మపనయ విష్ణో-దమయ మన, శ్శమయ విషయ మృగతృష్ణామ్ ।
భూతదయాం విస్తారయ- తారయ సంసార సాగరతః ॥ 1

తా॥ హే భగవాన్ ! శ్రీమహావిష్ణూ ! నా మదగర్వములను పోగొట్టి నా మనస్సును నిగ్రహింప జేయుము. లౌకిక విషయములనెడి భ్రమప్రమాదాత్మకములైన యెండమావులను శోషింప జేయుము. సర్వభూతముల పట్లను నాకు దయను పెంపొందించి నన్ను సంసారమనెడి సముద్రమును దాటింపుము.

శ్లో॥ దివ్యధునీ మకరందే-పరిమళ పరిభోగ సచ్చిదానందే ।
శ్రీపతి పదారవిందే-భవభయ ఖేదచ్ఛిదే వందే ॥ 2

తా॥ ఆకాశగంగయందు ప్రవహించు తేనెవంటి తీయని నీటికి మూలములై , సువాసనల ఆఘ్రాణింపు మొదలుకొని అన్ని విధములైన ఆనందములకును ఆకరములై , చావు పుట్టు కల భయమును, మరియు అందలి దుఃఖములను ఛేదింపజాలిన శ్రీమహావిష్ణువు యొక్క పాదపద్మములకు వందనము.

శ్లో॥ సత్యపి భేదాపగమే-నాథ! తవాహం న మామకీనస్త్వమ్।
సాముద్రో హి తరంగః- క్వచన సముద్రో న తారంగః ॥ 3

తా॥ హే జగదీశ్వరా! కెరటము సముద్రమునకు చెందును గాని, సముద్రము కెరటము నకు చెందదు. అట్లే, జీవాత్మకును పరమాత్మకును భేదము పోయిన స్థితియందు సైతము నేను నీకు చెందెదను గాని, నీవు నాకు చెందవు.

శ్లో॥ ఉద్ధృతనగ! నగభిదనుజ! దనుజకులామిత్ర ! మిత్రశశిదృష్టే ।
దృష్టే భవతి ప్రభవతి- న భవతి కిం భవతిరస్కారః॥ 4

తా॥ గోవర్ధనపర్వతము నెత్తినవాడా! పర్వతముల రెక్కలను తెగవేసిన ఇంద్రునికి తమ్ముడై ఉద్భవించినవాడా! రాక్షసజాతికి శత్రువైనవాడా! సూర్యచంద్రులు కండ్లుగా గలవాడా! హే శ్రీమహావిష్ణూ! నీ దర్శన మాత్రముచేతనే మానవుడు (శక్తిశాలి) ప్రభువగును గదా! ఇంక జన్మ పరంపరలను తిరస్కరించుట మాత్ర మేల జరుగదు?*(ముక్తపద గ్రస్తాలంకారము)*



శ్లో॥ మత్స్యాదిభి రవతారై-రవతారవతాఽవతా సదా వసుధామ్।
పరమేశ్వర పరిపాల్యో-భవతా భవ తాపభీతోఽహమ్॥ 5

తా॥ మత్స్యాది అవతారముల నెత్తి ఎల్లప్పుడును ప్రపంచమును కాపాడుచున్న పరమేశ్వరు డవు నీవు. ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపముల వలన భీతిల్లుచున్న నన్ను కాపాడ దగును.

శ్లో॥ దామోదర, గుణమందిర-సుందర వదనారవింద, గోవింద!
భవజలధి మథన మందర-పరమం దర మపనయ త్వమ్ మే॥ 6

తా॥ హే గోవిందా! దామోదరా! సకల సద్గుణములకు నెలవైనవాడా! సొగసైన కమలము వంటి ముఖము గలవాడా! సంసారమనెడి సముద్రమును చిలికి మోక్షమనెడి అమృత మును వెలికి తీయుటకై మందరపర్వతమువలె కవ్వమై నిలిచి తోడ్పడువాడా! నా భవ భయములను పోగొట్టుము. *(అనుప్రాసాలంకారము)*

శ్లో॥ నారాయణ, కరుణామయ-శరణం కరవాణి తావకౌ చరణౌ।
ఇతి షట్పదీ మదీయే-వదన సరోజే సదా వసతు॥ 7

తా॥ హే శ్రీమన్నారాయణా! కరుణామయా! నీ పాదపద్మములనే శరణువేడుచున్నాను. ఈ ఆరు శ్లోకముల షట్పదీ స్తోత్రము నా ముఖపద్మమున ఎల్లప్పుడును నర్తించు గాక !

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాదకృతం షట్పదీ స్తోత్రమ్ ॥

# 2. శ్రీ జగన్నాథాష్టకమ్

శ్లో॥ కదాచిత్ కాళిందీ – తట విపిన సంగీతక పరో
ముదా గోపీ నారీ – వదన కమలాస్వాద మధుపః ।
రమా శంభు బ్రహ్మా – ఉమరపతి గణేశార్చిత పదో
జగన్నాథ స్వామీ – నయన పథ గామీ భవతు మే ॥ 1

తా॥ ఒకానొకప్పుడు యమునానది ఒడ్డున తోటలో శ్రీమహాలక్ష్మియు, శివుడును, బ్రహ్మదేవుడును, దేవేంద్రుడును, విఘ్నేశ్వరుడును తన పాదములను పూజించుచుండగా పిల్లన గ్రోవి నూదుచు, ప్రీతితో గోపికాస్త్రీల ముఖ కమలముల నాస్వాదించు తుమ్మెదవంటివాడైన శ్రీ జగన్నాథ స్వామి నా కండ్లకు గోచరమగును గాక!

శ్లో॥ భుజే సవ్యే వేణుం – శిరసి శిఖిపింఛం, కటితటే
దుకూలం, నేత్రాంతే – సహచర కటాక్షం విదధతే ।
సదా శ్రీమద్ బృందా – వన వసతి లీలా పరిచయో
జగన్నాథ స్వామీ – నయన పథ గామీ భవతు మే ॥ 2

తా॥ తలపై నెమలి పింఛమును దాల్చి, నడుమునకు పట్టువస్త్రము చుట్టుకొని, తన కుడిభుజమున పిల్లన గ్రోవిని మోపి, తన తోడి గోపబాలకులను క్రీగంట వీక్షించుచు అందమైన బృందావన నివాసమున తన లీలలను ప్రదర్శించుటలో నిపుణుడైన శ్రీ జగన్నాథ స్వామి నా కండ్లకు గోచరమగును గాక!

శ్లో॥ మహాంభోధేస్తీరే – కనక రుచిరే నీల శిఖరే
వసన్ ప్రాసాదాంత – స్సహజ బలభద్రేణ బలినా ।
సుభద్రామధ్యస్థ – స్సకల సుర సేవావసరదో
జగన్నాథ స్వామీ – నయన పథ గామీ భవతు మే ॥ 3

తా॥ పడమటి మహాసముద్రతీరమునందు బంగారుకాంతులీను రైవతక పర్వత శిఖరము నందలి రాజప్రాసాదమున ఒకవైపు బలశాలియైన తన అన్నగారు బలరాముడును, మరియొక వైపు తన ప్రియసఖియైన సుభద్రాదేవియు తోడైయుండ సకలదేవతలకును తన సేవజేసికొను అవకాశము ననుగ్రహించు జగన్నాథస్వామి నా కండ్లకు గోచరమగును గాక!



శ్లో॥ కథాపారావార – స్సజల జలద శ్రేణి రుచిరో
రమావాణీసౌమ – స్స్ఫురదమల పద్మోద్భవ ముఖైః ।
సురేంద్రై రారాధ్యః – శ్రుతిగణ శిఖాగీత చరితో
జగన్నాథ స్వామీ – నయన పథ గామీ భవతు మే ॥ 4

తా॥ సముద్రజలమువలె ఎంత చెప్పినను తరుగని లీలలు గలవాడును, నీటితో నిండిన మేఘ పంక్తివంటి మేనిచాయతో నొప్పువాడును, శ్రీమహాలక్ష్మి, సర స్వతి, బ్రహ్మదేవుడు మున్నగు దేవతాప్రముఖులకు పూజనీయుడైనవాడును, వేదశాస్త్రములచే కీర్తింపబడిన పవిత్రచరిత్ర గలవాడును అగు శ్రీ జగన్నాథ స్వామి నా కండ్లకు గోచరమగును గాక!

శ్లో॥ రథారూఢో గచ్ఛన్ – పథి మిళిత భూదేవ పటలైః
స్తుతిప్రాదుర్భావం – ప్రతిపద ముపాకర్ణ్య సదయః ।
దయాసింధు ర్భాను– స్సకల జగతాం సింధు సుతయా
జగన్నాథ స్వామీ – నయన పథగామీ భవతు మే ॥ 5

తా॥ శ్రీమహాలక్ష్మితో గలసి రథమెక్కి రాజమార్గమున సాగుచున్నప్పుడు దారిమధ్యలో తారసిల్లిన బ్రాహ్మణబృందములు తనను స్తుతిసేయుచుండగా, నందలి ప్రతిపదమును దయతో ఆలకించి ప్రపంచమునంతటిని సూర్యుని వలె అనుగ్రహించు శ్రీ జగన్నాథ స్వామి నా కండ్లకు గోచరమగును గాక!

శ్లో॥ పరబ్రహ్మాపీడః – కువలయ దళోత్ఫుల్లనయనో
నివాసీ నీలాద్రౌ – నిహిత చరణోఽనన్త శిరసి ।
రసానందో రాధా – సరసవపు రాలింగనసుఖో
జగన్నాథ స్వామీ – నయన పథ గామీ భవతు మే ॥ 6

తా॥ పరబ్రహ్మతత్త్వమునకే శిరోమణివంటివాడును, వికసించిన పద్మపు రేకలవంటి విశాల నేత్రములు గలవాడును, రైవతక పర్వతమునందు నివసించువాడును, అనంతుడనెడి దివ్య సర్పపు పడగలపై నర్తించువాడును, రాధాదేవి యొక్క ప్రేమమయమైన కౌగిలింతల సుఖమును అనుభవించు రసానందస్వరూపుడును అయిన శ్రీ జగన్నాథస్వామి నా కండ్లకు గోచరమగును గాక!

శ్లో॥ న వై ప్రార్థ్యం రాజ్యం – నచ కనకతాం భోగ విభవం

న యాచేఽహం రమ్యాం – నిఖిల జనకామ్యాం వరవధూం ।
సదా కాలే కాలే – ప్రమథ తతినా గీతచరితో
జగన్నాథ స్వామీ – నయనపథగామీ భవతు మే ॥ 7

తా॥ నేను రాజ్యమును గాని, బంగారు వస్తువులను గాని (ధనమును గాని), భోగములను గాని, వైభవములను గాని, పురుషులెల్లరికి అభిలషణీయమైన అందమైన స్త్రీని గాని కోరుట లేదు. నేను కోరునది, ''ఎల్లప్పుడును, ఎల్లవేళల భక్తులచే కీర్తింపబడు శ్రీ జగన్నాథ స్వామి నా కండ్లకు గోచరము కావలె'' నని మాత్రమే.

శ్లో॥ హర త్వం సంసారం – ద్రుతతర మసారం సురపతే
హర త్వం పాపానాం – వితతి మపరాం యాదవపతే ।
అహో ఽదీనానాథం – నిహిత మచలం నిశ్చల పదం
జగన్నాథ స్వామీ – నయన పథ గామీ భవతు మే ॥ 8

తా॥ హే యాదవేశ్వరా! శ్రీ జగన్నాథా! దేవదేవా! సారములేని ఈ సంసారమును వేగ హరింపుము. అట్లే నేను చేసిన పాపముల రాశిని సైతము హరింపుము. అదీనము(గంభీరము), అనాథము (తనపై మరియొక ప్రభువు లేనటువంటిది), నిహితము(నిగూఢము), అచలము (మార్పులేనిది), మరియు నిశ్చల పదము (రాకపోకలు లేనిది) అగు శ్రీ జగన్నాథ పరబ్రహ్మము నా కండ్లకు గోచరమగును గాక!

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాదకృతం జగన్నాథాష్టకమ్ ॥



# 3. శ్రీమదర్ధనారీశ్వర స్తోత్రమ్

◀ అవతారిక ▶

*జగజ్జననీజనకులైన శివశక్తులను సమాయుక్తరూపముగా భావించి ఉపాసించుటయే ఈ స్తోత్ర ముఖ్యోద్దేశము. ఆ సందర్భముగా వారి మధ్య గల సాదృశ్య వ్యత్యాసములను వర్ణించుచు, ఆయా గుణములు అర్ధనారీశ్వర స్వరూపములో క్షీరనీర న్యాయముగా ఎట్లు కలగలసిపోయినవో ఈ స్తోత్రము కవితామయముగా విశదీకరించుచున్నది.*

శ్లో॥ చాంపేయ గౌరార్ధ శరీరకాయై, కర్పూర గౌరార్ధ శరీరకాయ ।
ధమ్మిల్లకాయై చ జటాధరాయ, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 1

తా॥ చవితి చంద్రుని వలె తెల్లని శరీరమును (భర్తయందు) సగపాలు ధరించి కొప్పుముడివేసికొన్న పార్వతీదేవికిని, కర్పూరము వలె తెల్లని శరీరమును (భార్యయందు) సగపాలు ధరించి జడలు విరబోసికొన్న శివునికిని నమస్కారము.

శ్లో॥ కస్తూరికా కుంకుమ చర్చితాయై, చితా రజః పుంజ విచర్చితాయ ।
కృత స్మరాయై వికృత స్మరాయ, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 2

తా॥కస్తూరీ తిలకము దిద్ది , కుంకుమను అలందుకొని (శివునికే) మన్మథతాపము కలిగింపజాలిన అపర్ణాదేవికిని, చితాభస్మము మేన పూసికొని మన్మథుని భస్మము జేసిన పశుపతినికి నమస్కారము.

శ్లో॥ ఝణత్ క్వణత్ కంకణ నూపురాయై, పదాబ్జ రాజత్ ఫణి నూపురాయ ।
హేమాంగదాయై భుజగాంగదాయ, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 3

తా॥ ఘల్లుఘల్లున మ్రోగు బంగారు కంకణములను, గజ్జెలను, బాహుపురులను ధరించిన భవానికిని, కస్సుబుస్సుమను పాములనే కంకణములుగా, అంగదములుగా పాదపద్మములందు గజ్జెలుగా ధరించిన ఈశ్వరునికిని నమస్కారము.

శ్లో॥ విశాల నీలోత్పల లోచనాయై, వికాసి పంకేరుహ లోచనాయ ।
సమేక్షణాయై విషమేక్షణాయ, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 4

తా॥ నల్లని కలువ రేకలవంటి విశాలమైన సరికన్నులు గల అంబికకును, వికసించిన తెల్లని

కలువ రేకలను బోలిన బేసికన్నులు (మూఁడు కన్నులు) గల శంకరునికిని నమస్కారము.

శ్లో॥ మందార మాలా కలితాలకాయై, కపాల మాలాంకిత కంధరాయ ।
దివ్యాంబరాయై చ దిగంబరాయ, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 5

తా॥ మందార పూలమాలతో కేశబంధమును అలంకరించుకొని, దివ్యమైన పట్టువస్త్రములను ధరించిన హైమవతికిని, కపాలముల దండ మెడలో వేసికొని దిసమొలగా నున్న శర్వునకును నమస్కారము.

శ్లో॥ అంభోధర శ్యామల కుంతలాయై, తటిత్ ప్రభా తామ్ర జటాధరాయ ।
నిరీశ్వరాయై నిఖిలేశ్వరాయ, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 6

తా॥ కారుమబ్బులవంటి నల్లని శిరోజములతో నొప్పారుచు తనపై వేరే ఈశ్వరుఁడు లేని దాక్షాయణికిని, మెరుపుతీగలవంటి ఎఱ్ఱని కాంతులీను జడలతో విలసిల్లు సర్వేశ్వరుఁడైన శ్రీ మహాదేవునికిని నమస్కారము.

**విశేషము :** పార్వతి శివునితో మమేకమైపోయిన తరువాత ఇంక ఎవరు భర్త ? ఎవరు భార్య ? ఎవరు జీవుఁడు ? ఎవరు దేవుఁడు ? అందుచేత ఆ స్థితిలో పార్వతీమాత నిరీశ్వరియే (తనపై మరియొక దైవశక్తి లేనటువంటిదే) అగును.

శ్లో॥ ప్రపంచ సృష్ట్యున్ముఖ లాస్యకాయై, సమస్త సంహారక తాండవాయ ।
జగజ్జనన్యై జగదేక పిత్రే, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 7

తా॥ ప్రపంచమును సృజించుటకు ముందు విలాసముగా ఆనందలాస్య (నృత్య)మాడు జగజ్జననికిని, ప్రపంచమును విలయము (నాశనము) చేయుటకు ముందు తాండవమాడు జగదేక పిత, శంభునకును నమస్కారము.

**విశేషము :** స్త్రీల నృత్యమునకు లాస్యమనియు, పురుషుల నృత్యమునకు తాండవమనియు వ్యవహారము.

శ్లో॥ ప్రదీప్త రత్నోజ్జ్వల కుండలాయై, స్ఫురన్మహా పన్నగ భూషణాయ ।
శివాన్వితాయై చ శివాన్వితాయ, నమశ్శివాయై చ నమశ్శివాయ ॥ 8

తా॥ ధగద్ధగాయమానముగా వెలుగొందు రత్న కుండలములతో విరాజిల్లుచు శివునితో కలిసిపోయిన శివాదేవికిని, మిగుల మెరయుచున్న నాగులనే నగలుగా దాల్చి శివాదేవితో కలిసి పోయిన శివదేవునికిని నమస్కారము.



**: ఫలశ్రుతి :**

శ్లో॥ ఏతత్ పఠే దష్టక మిష్టదం యో, భక్త్యా స మాన్యో భువి దీర్ఘజీవీ ।
ప్రాప్నోతి సౌభాగ్య మనంత కాలం, భూయాత్ సదా తస్య సమస్త సిద్ధిః ॥ 9

తా॥ కోరిన కోర్కెలను దీర్చఁజాలిన ఈ యర్ధనారీశ్వరాష్టకమును ఎవరైతే భక్తిశ్రద్ధలతో ఎల్లప్పుడును పఠించెదరో, వారు కోరినదెల్ల సిద్ధించుటయే కాక, చిరకాలము పాటు ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లుచు సత్కరింపఁబడుదురు.

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతం అర్ధనారీశ్వర స్తోత్రమ్ ॥

# 4. శ్రీ లలితా పంచరత్నమ్

◀ అవతారిక ▶

*ఈ సంక్షిప్త స్తోత్రమునందు శ్రీ లలితా అమ్మవారి సగుణ నిర్గుణ స్వరూప ధ్యానము మరియు తొమ్మిది పవిత్ర నామముల ప్రస్తావనయుఁ గలవు.*

శ్లో॥ ప్రాతః స్మరామి లలితా వదనారవిందం
బింబాధరం పృథులమౌక్తిక శోభి నాసమ్ ।
ఆకర్ణ దీర్ఘ నయనం మణి కుండలాఢ్యం
మందస్మితం మృగమదోజ్జ్వల ఫాలదేశమ్ ॥ 1

తా॥ శ్రీ లలితాదేవి యొక్క భవ్య ముఖారవిందమును ప్రాతః కాలముననే ధ్యానించెదను. ఆమె ముఖము దొండపండువంటి ఎర్రని పెదవులతో నొప్పారునది.పెద్ద ఆణిముత్యపు ముక్కెరతో విలసిల్లు అందమైన ముక్కు గలది. చెవుల పర్యంతము విస్తరించిన చేరెడు కళ్ళతో విరాజిల్లునట్టిది. మణులు పొదిగిన కుండలములతో పరిఢవిల్లునట్టిది. చిరునవ్వులు చిందించునట్టిది. మరియు కస్తూరీ తిలకము దిద్దిన దేదీప్యమానమగు నుదుటితో భాసించునటువంటిది.

శ్లో॥ ప్రాతర్భజామి లలితా భుజ కల్పవల్లీం
రత్నాంగుళీయ లసదంగుళి పల్లవాఢ్యామ్ ।
మాణిక్య హేమ వలయాంగద శోభమానాం
పుండ్రేక్షు చాప కుసుమేషు సృణీర్ దధానామ్ ॥ 2

తా॥ శ్రీ లలితాదేవి యొక్క సన్ననిబాహువులనెడి కల్పవృక్షపు తీగలను ప్రాతః కాలముననే భజించెదను. ఆమె బాహువులు కోరిన కోర్కెలను నెరవేర్పజాలినట్టివి. అవి రత్నపు టుంగరములతో ప్రకాశించు చిగురుటాకులవంటి చేతి వ్రేళ్ళతో నొప్పారునట్టివి. మణులు పొదిగిన బంగారు కంకణములతోను, బాహుపురులతోను తులకించునట్టివి. ఒకవైపున చెరకుగడను, మరియొక వైపున పూవింటిని, బాణములను ధరించినట్టివి.

శ్లో॥ ప్రాతర్నమామి లలితా చరణారవిందం
భక్తేష్ట దాన నిరతం భవ సింధు పోతమ్ ।



పద్మాసనాది సుర నాయక పూజనీయం
పద్మాంకుశ ధ్వజ సుదర్శన లాంఛనాఢ్యమ్ ॥ 3

తా॥ శ్రీ లలితాదేవి యొక్క పాదపద్మములకు ప్రాతః కాలముననే వందన మాచరించెదను. ఆమె పాదములు ప్రణమిల్లెడు భక్తుల అభీష్టములను కాదనక ప్రసాదించుటలో నిమగ్నమైనట్టివి. అవి సంసార సాగరమును దాటించు నావలవంటివి. బ్రహ్మాదిప్రముఖులకు సైతము పూజనీయమైనవి. పద్మము, అంకుశము, ధ్వజము, సుదర్శనము మొదలగు చిహ్నములతో శోభిల్లునట్టివి.

శ్లో॥ ప్రాతః స్తువే పరశివాం లలితాం భవానీం
త్రయ్యంత వేద్య విభవాం కరుణాఽనవద్యామ్ ।
విశ్వస్య సృష్టి విలయ స్థితి హేతు భూతాం,
విద్యేశ్వరీం నిగమ వాఙ్మనసాఽతిదూరామ్ ॥ 4

తా॥ శ్రీ లలితాదేవిని ప్రాతః కాలముననే స్తుతించెదను. ఆమె పరశివ (ఆత్యంతిక మంగళ స్వరూపము). భవుని అర్థాంగి యగుటఁజేసి భవాని. ఉపనిషత్తుల ద్వారా తెలియఁదగిన మహిమగలది. ఆమెయే సృష్టి స్థితి లయములకు కారణము. ఐనను సాటిలేని కరుణామయి కూడా. ఆమెయే పరా విద్యలకును, అపరా విద్యలకును అధిష్ఠాన దేవత. కాని అదే సమయములో వేదములకును, మనోవాక్కులకును అతీతురాలై యున్నది.

శ్లో॥ ప్రాతర్వదామి లలితే ! తవ పుణ్యనామ,
కామేశ్వరీతి కమలేతి మహేశ్వరీతి ।
శ్రీ శాంభవీతి జగతాం జననీ పరేతి
వాగ్దేవతేతి వచసా త్రిపురేశ్వరీతి ॥ 5

తా॥ అమ్మా ! శ్రీ లలితాదేవీ ! ప్రతిదినమును ప్రాతః కాలముననే లేచి, '' కామేశ్వరీ ! కమలా ! మహేశ్వరీ ! శ్రీ శాంభవీ ! జగజ్జననీ ! పరాదేవతా ! వాగ్దేవతా ! త్రిపురేశ్వరీ ! '' అనుచు నీ పవిత్ర నామములనే ఉచ్చరించెదను సుమా !

: ఫలశ్రుతి :

శ్లో॥ యః శ్లోక పంచక మిదం లలితాంబికాయాః
సౌభాగ్యదం సులలితం పఠతి ప్రభాతే ।

తస్మై దదాతి లలితా ఝుడితి ప్రసన్నా
విద్యాం శ్రియం విపుల సౌఖ్య మనంతకీర్తిమ్ ॥ 6

తా॥ సకల మంగళములను బహు సులభముగా ప్రసాదించు ఈ లలితా పంచరత్న స్తోత్ర మును ప్రతిదినమును ప్రాతః కాలముననే పఠించినవారికి అమ్మవారు శీఘ్రమే ప్రసన్నురాలై కోరిన విద్య లను, సంపదలను, విస్తారమైన సుఖములను మరియు తరగని కీర్తిని అనుగ్ర హింపగలరు.

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతం లలితా పంచరత్న స్తోత్రమ్ ॥



# 5. శ్రీ భవానీ భుజంగ ప్రయాత స్తోత్రమ్

శ్లో॥ షడాధార పంకేరుహాంతర్ విరాజత్, సుషుమ్నాంతరాళేఽతి తేజో లసంతీమ్ ।
సుధామండలం ద్రావయంతీం పిబంతీం, సుధామూర్తి మీడే చిదానంద రూపామ్ ॥ 1

తా॥ సహస్రార చక్రమునందలి సుషుమ్నా నాడిలోపల మిక్కిలి తేజస్సుతో ప్రకాశించుచు, అమృత మును స్రవించుచు, మరియు దానిని ఆస్వాదించుచునుండు చిదానంద స్వరూపురాలైన అమృత మూర్తి శ్రీ భవానీదేవిని భక్తితో స్తుతించెదను.

శ్లో॥ జ్వలత్ కోటి బాలార్క భాసారుణాంగీం, సులావణ్య శృంగార శోభాభిరామామ్ ।
మహాపద్మ కింజల్క మధ్యే విరాజత్, త్రికోణే నిషణ్ణాం భజే శ్రీ భవానీమ్ ॥ 2

తా॥ శ్రీ భవానీదేవి భగభగ మండుచున్న కోటిమంది ఉదయకాల సూర్యుల కాంతివలె వెలయు ఎర్రని మైచాయ గలది. కోమలత్వము, శృంగారము, సౌందర్యము అను మూడు గుణములతో అల రారునట్టిది. ఆమె త్రికోణాకార యంత్రముపై పద్మకేసరముల రాశి మధ్య ఆసీనురాలై యుండు ను. అట్టి శ్రీ భవానీదేవిని భక్తితో భజించెదను.

శ్లో॥ క్వణత్ కింకిణీ నూపురోద్భాసి రత్న, ప్రభాలీఢ లాక్షార్ద్ర పాదాబ్జ యుగ్మమ్ ।
అజేశాచ్యుతాద్యై స్సురై స్సేవ్యమానం, మహాదేవి ! మన్మూర్ధ్ని తే భావయామి ॥ 3

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! ఎర్రని లత్తుక పూత ఇంకను ఆరని నీ పాదపద్మముల జంట ఘల్లుఘ ల్లుమను నీ గజ్జెలకును, పట్టెడలకును పొదిగిన రత్నాల యొక్క కాంతులు ప్రసరించుచున్నట్టిది. అవి బ్రహ్మ విష్ణు మహేశ్వరాది దేవతలచేతనే సేవింపబడుచున్నట్టివి. అట్టి నీ దివ్యమైన పాదపద్మ ములు నా తలపై నెలకొని యున్నట్లుగా ఊహించుచున్నాను.

శ్లో॥ సుశోణాంబరాబద్ధ నీవీ విరాజన్-మహారత్న కాంచీ కలాపం నితంబమ్ ।
స్ఫురద్ దక్షిణావర్త నాభిం చ తిస్రో, వళీ రంబ ! తే రోమరాజిం భజేహమ్ ॥ 4

తా॥ అమ్మా ! శ్రీ భవానీ దేవీ ! నీ ఎర్రెర్రని చీరను పట్టియుంచు మొలనూలి మీద గొప్ప రత్నాల వడ్డా ణముతో శోభిల్లుచున్న నీ అందమైన పిరుదులను భజించెదను. సుడిగుండము వంటి ఆకారము గల్గి మాటిమాటికి ముందుకు వెనుకకు ఇంచుక చలించుచున్న నీ మనోహరమైన నాభిని భజించెద ను. అట్లే నీ పొట్టపై నేర్పడిన మూడు ముచ్చటైన ముడుత

లను, అటునుండి దిగిన సుతారమైన రోమరేఖను సైతము భక్తితో భజించెదను.

శ్లో॥ లసద్ వృత్త ముత్తుంగ మాణిక్య కుంభో- పమ శ్రీ స్తన ద్వంద్వ మంబాంబుజాక్షి ।
భజే దుగ్ధ పూర్ణాభిరామం తవేదం, మహా హార దీప్తం సదా ప్రస్నుతాస్యమ్ ॥ 5

తా॥ కలువ రేకలవంటి కన్నులు గల తల్లీ ! శ్రీ భవానీదేవీ ! నీ పవిత్రమైన శ్రీ స్తనముల జంట గుండ్రముగా విలసిల్లునట్టిది. నీవు మెడలో ధరించిన గొప్ప బంగారు హారముల కాంతితో మెర యుచున్నట్టిది. అవి ఎత్తుగా రత్నాల కుండలవలె పొంగినట్టివి. పాలతో నిండిపోవుట వలన ఇనుమ డించిన సౌందర్యముతో అలరారుచు, ఎల్లప్పుడును తడిసియే యున్న చనుమొనలు గల్గినటు వంటివి. అట్టి నీ స్తనములను భక్తితో భజించెదను.

శ్లో॥ శిరీష ప్రసూనోల్లసద్ బాహు దండైర్, జ్వలద్ బాణ కోదండ పాశాంకుశైశ్చ ।
చలత్ కంకణోదార కేయూర భూషో- జ్జ్వలద్భిర్ లసంతీం భజే శ్రీ భవానీమ్ ॥ 6

తా॥ (సొంపుగా) కదలాడుచున్న కంకణములతోను, భుజకీర్తులతోను విలసిల్లు దిరిసెన పూల వంటి కోమలమైన తన నాలుగు బాహువులయందును విజృంభింపగల విల్లంబులను, పాశమును, అంకుశమును ధరించి వెలుగొందు శ్రీ భవానీదేవిని భక్తితో భజించెదను.

శ్లో॥ శరత్పూర్ణ చంద్రప్రభా పూర్ణ బింబా- ధర స్మేర వక్త్రారవిందాం సుశాంతామ్ ।
సురత్నావళీ హార తాటంక శోభాం, మహా సుప్రసన్నాం భజే శ్రీ భవానీమ్ ॥ 7

తా॥ జాతిరత్నముల కంటెలను, మణిహారములను, కర్ణాభరణములను ధరించి శోభిల్లుచు, దొండ పండువంటి పెదవులపై చిరునగవులు తొణికిసలాడుచుండ, తన ముఖపద్మ మునందు శరత్కా లపు నిండుపున్నమి వెన్నెలలు రహించు మహాశాంతమూర్తి యైన శ్రీ భవానీదేవిని భక్తితో భజించెద ను.

శ్లో॥ సునాసాపుటం సుందర భ్రూ లలాటం, తవౌష్ఠ శ్రియం దానదక్షం కటాక్షమ్ ।
లలాటోల్లసద్ గంధ కస్తూరి భూషం, స్ఫురత్ శ్రీ ముఖాంభోజ మీడేஉహ మంబ ॥ 8

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! నీ అందమైన ముక్కును, నీ సొగసైన కనుబొమలను, నీ చెన్నారు నుదుటిని, ఆ నుదుట విలసించు శ్రీ గంధ కస్తూరీ తిలకములను, నీ శోభస్కర మైన పెదవులను, కోరిన వరముల నొసంగుటకు సమర్థమైన నీ క్రీగంటి చూపును, మిరుమిట్లుగొలుపు నీ మంగళకర ముఖపద్మమును ఎల్లప్పుడును భక్తితో కొనియాడెదను.



శ్లో॥ చలత్ కుంతలాంతర్ భ్రమద్ భృంగ బృందం, ఘన స్నిగ్ధ ధమ్మిల్ల భూషోజ్జ్వలం తే ।
స్ఫురన్మౌళి మాణిక్య బద్ధేందు రేఖా, విలాసోల్లసద్ దివ్య మూర్ధాన మీడే ॥ 9

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! నీ కురులు అలవోకగా అల్లలాడునప్పుడు తుమ్మెదలు ఝు మ్మని మూగుచున్నట్లు భ్రమగొల్పునదియు, దట్టముగా ముడివేసిన కొప్పున గల బంగారు ఆభరణ ములతో ప్రకాశించునదియు, చూడామణివలె తురిమిన నెలవంకతో విలాసముగా వెలుగొందున దియు నైన నీ దివ్య శిరోభాగమును వేడ్కతో ప్రశంసించెదను.

శ్లో॥ ఇతి శ్రీ భవాని ! స్వరూపం తవేదం, ప్రపంచాత్ పరం చాஉతి సూక్ష్మం ప్రసన్నమ్ ।
స్ఫుర త్వంబ ! డింభస్య మే హృత్సరోజే, సదా వాఙ్మయం సర్వ తేజోమయం చ ॥ 10

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! లోకాతీతమును, అత్యంత సూక్ష్మమును (శాస్త్ర సంకేతములచే నిగూ ఢము మరియు సామాన్యులకు అగ్రాహ్యము), సదా సుప్రసన్నమును, సర్వ దేవతా తేజస్సుల మిశ్రమము నైన నీ యీ స్వరూపము నీ పాప(డ)నైన నా హృదయ కమలమునందు ఎల్లప్పుడును ఇట్లే శబ్ద సారస్వత రూపముగా భాసించుఁ గాక !

శ్లో॥ గణేశాణిమాద్యాఖిలై శ్శక్తిబృందైర్, వృతాం వై స్ఫురచ్చక్ర రాజోల్లసంతీమ్ ।
పరాం రాజ రాజేశ్వరి ! త్రైపురి ! త్వాం, శివాంకోపరిస్థాం శివాం భావయామి ॥ 11

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! హే రాజరాజేశ్వరీ ! త్రిపురేశ్వరీ ! ప్రమథగణములును, వాని అధినాథు లును, అణిమా మహిమాది అష్టసిద్ధులును, ఇతర శక్తిస్వరూపిణులును చేరి కొలువగా, ఉజ్జ్వల మైన శ్రీ చక్ర రాజమునందు శివుని అంకపీఠిని అధివసించు ఆది పరా శక్తివి, శివాదేవివి ఐన నిన్ను ఎల్లప్పుడును భక్తితో ధ్యానించెదను.

శ్లో॥ త్వమర్క స్త్వ మిందు స్త్వమగ్ని స్త్వమాప, స్త్వమాకాశ భూ వాయవస్త్వమ్ మహత్త్వమ్ ।
త్వదన్యో న కశ్చిత్ ప్రపంచేஉస్తి సర్వం, త్వ మానంద సంవిత్స్వరూపాం భజేஉహమ్॥ 12

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! కర్మసాక్షులైన సూర్యచంద్రులు నీవే. పృథ్వీ (భూమి), ఆపస్ (నీరు), తేజో (అగ్ని), వాయు (గాలి), ఆకాశము లనెడి పంచ భూతములును నీవే.సృష్ట్యాదిన ఉన్న మహ త్ తత్త్వమును నీవే. అన్నియు నీవే. నీకంటె వేరుగా ప్రపంచమునందు వేరెద్దియు లేదు. అట్టి ఆనంద స్వరూపిణియు, బుద్ధి స్వరూపిణియు నైన నిన్ను ఎల్లప్పుడు భక్తితో భజించెదను.

శ్లో॥ శ్రుతీనా మగమ్యే సువేదాగమజ్ఞా, మహిమ్నో న జానంతి పారం తవాఽమ్బ ।
స్తుతిం కర్తు మిచ్ఛామి తే ; భవాని ! క్షమస్వేద మత్ర ప్రముగ్ధః కిలాఽహమ్ ॥ 13

తా॥ వేదములకే తెలియరాని తల్లీ ! శ్రీ భవానీదేవీ ! వేదశాస్త్ర నిష్ణాతలే నీ మహిమల ఆద్యంతములను ఎరుగనప్పుడు, పరమ అజ్ఞానినైన నేను నిన్ను సమగ్రముగా స్తుతింప గోరుచున్నాను గదా ! నా యీ ప్రయత్నమును మన్నింపవలసినది.

శ్లో॥ గురుస్త్వం శివస్త్వం చ శక్తిస్త్వమేవ, త్వమేవాఽసి మాతాపితా చ త్వమేవ ।
త్వమేవాఽసి విద్యా త్వమేవాఽసి బంధుర్, గతిర్ మే మతిర్ దేవి ! సర్వం త్వమేవ ॥ 14

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! గురువవు నీవే. శివుడవు నీవే. శక్తివి నీవే. తల్లివి నీవే. తండ్రివి నీవే. జ్ఞానము నీవే. చుట్టము నీవే. నా గతివి నీవే. మతివి నీవే. నాకిక అన్నియు నీవే.

శ్లో॥ వరేణ్యే ! శరణ్యే ! సుకారుణ్య మూర్తే ! హిరణ్యోదరాద్యై రగణ్యే ! సుపుణ్యే !
భవారణ్య భీతేశ్చ మాం పాహి భద్రే ! నమస్తే నమస్తే నమస్తే భవాని ! ॥ 15

తా॥ అమ్మా ! శ్రీ భవానీదేవీ ! సర్వదేవతా వరేణ్యురాలా ! శరణ్యురాలా ! బ్రహ్మాది దేవతలకే అగణ్యురాలా ! సుపుణ్యురాలా ! సంసారమనెడి ఈ కీకారణ్యపు భయభ్రాంతి నుండి నన్ను కాపాడుము తల్లీ ! పాహిమాం ! పాహిమాం !నమస్తే నమస్తే నమస్తే భవానీ !

**: ఫలశ్రుతి :**

శ్లో॥ ఇతీమాం మహత్ శ్రీ భవానీ భుజంగ-స్తుతిం యః పఠేత్ శక్తియుక్తశ్చ తస్మై ।
స్వకీయం పదం శాశ్వతం వేదసారం, శ్రియం చాఽష్టసిద్ధిం భవానీ దదాతి ॥ 16

తా॥ అని యీ విధముగా మహిమాన్వితమైన యీ *భవానీ భుజంగ ప్రయాత స్తోత్రము* యథాశక్తి పారాయణ చేసినవారికి శ్రీ భవాని అమ్మవారు సంపదలను, అష్టసిద్ధులనే కాక వేదములలో వర్ణించిన శాశ్వత సాలోక్య ముక్తిని సైతము అనుగ్రహింపగలరు.

శ్లో॥ భవానీ భవానీ భవానీ త్రివారం, హ్యుదారం ముదా సర్వదా యే జపంతి ।
న శోకో న మోహో న పాపం న భీతిః, కదాచిత్ కథంచిత్ కుతశ్చి జ్జనానామ్ ॥ 17

తా॥ భవానీ ! భవానీ ! భవానీ ! అని దినమునకు ముమ్మారు జపించినను సరియే, అట్టివారికి ఎప్పుడును, ఎక్కడను, ఏ విధముగాను శోక, మోహ, పాప, భీతులు దరిజేరవు.

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతమ్ భవానీ భుజంగ ప్రయాత స్తోత్రమ్ ॥



# 6. శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్

శ్లో॥ ఉపాసకానాం యదుపాసనీయ, ముపాత్తవాసం వటశాఖి మూలే ।
తద్ధామ దాక్షిణ్యజుషా స్వమూర్త్యా జాగర్తి చిత్తే మమ బోధరూపమ్ ॥ 1

తా॥ ఉపాసింపగోరువారికి ఉపాసింపదగినదై, సగుణ స్వరూపముతో మర్రిచెట్టు క్రింద వెలసినట్టి ఆ (సద్గురు) సన్నిధానము కనికరమును వహించి తనకు స్వాభావికమైన జ్ఞానరూపముతో నా చిత్తమునందు సాక్షాత్కరించుచున్నది.

శ్లో॥ అద్రాక్ష మక్షీణ దయానిధాన, మాచార్య మాద్యం వటమూలభాగే ।
మౌనేన మందస్మిత భూషితేన, మహర్షిలోకస్య తమో నుదంతమ్ ॥ 2

తా॥ మహర్షిలోకపు టజ్ఞాన పుంజమును చిరునగవు సింగారించిన తన మౌనముతో తొలగ ద్రోయు అనంత దయానిధి యైన ఆదిగురువు శ్రీ దక్షిణామూర్తిస్వామివారిని మర్రిచెట్టు క్రింద ఇప్పుడు దర్శించితిని.

శ్లో॥ విద్రావితాశేష తమో గణేన, ముద్రా విశేషేణ ముహుర్మునీనామ్ ।
నిరస్య మాయాం దయయా విధత్తే, దేవో మహాం స్తత్త్వమసీతి బోధమ్ ॥ 3

తా॥ దేవదేవుడైన ఆ దక్షిణామూర్తిస్వామివారు తన విశిష్టమైన అభయ ముద్రతో మునుల అజ్ఞానపు పొరలను మరల మరల పోకార్చుచు, మాయావరణమును ఖండించుచు, కరుణతో 'తత్త్వమసి' అను మహావాక్యమును బోధించుచున్నారు.

శ్లో॥ అపార కారుణ్య సుధా తరంగై, రపాంగపాతై రవలోకయంతమ్ ।
కఠోర సంసార నిదాఘ తప్తాన్, మునీ నహం నౌమి గురుం గురూణామ్ ॥ 4

తా॥ దుర్భరమైన సంసారమనెడి వేసవి వేడిమికి మలమల మాడుచున్న మునులను తన అంతులేని చల్లని కనికరపు క్రీగంటి చూపుల అమృత కెరటాలు పరపి శాంతపరచు మా పరమగురువు శ్రీ దక్షిణామూర్తిస్వామివారికి భక్తితో తలవంచుచున్నాను.

శ్లో॥ మమాఽద్య దేవో వటమూలవాసీ, కృపావిశేషాత్ కృతసన్నిధానః ।
ఓంకార రూపా ముపదిశ్య విద్యా, మావిద్యక ధ్వాంత మపాకరోతు ॥ 5

తా॥ ఈనాడు ప్రత్యేకమైన దయతో మర్రిచెట్టు క్రింద వేంచేసి యున్న శ్రీ దక్షిణామూర్తి స్వామివారు 'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ' ఇత్యాదిగా గల మహావాక్యములతో మొదలగు బ్రహ్మ విద్యను నాకు ఉపదేశించి నా అజ్ఞాన తమస్సును హరించెదరు గాక !

శ్లో॥ కళాభి రిందో రివ కల్పితాంగం, ముక్తాకలాపై రివ బద్ధమూర్తిమ్ ।
ఆలోకయే దేశిక మప్రమేయ, మనాద్యవిద్యా తిమిర ప్రభాతమ్ ॥ 6

తా॥ చంద్రునివలె షోడశ కళా ప్రపూర్ణుడును (అనగా- ఉపనిషత్తులలో వర్ణించిన ఆత్మస్వరూపుడును), ముత్యాల దండలతో అలంకరించినట్లు తెలతెల్లనివాడును, మొదలెక్కడో యెరుగరాని అజ్ఞానపు చీకట్ల పాలిట ఉషః కాలమువంటివాడును, అనిర్వచనీయుడును ఐన పరమగురువు శ్రీ దక్షిణామూర్తిస్వామివారిని భక్తితో దర్శించుచున్నాను.

శ్లో॥ స్వదక్ష జానుస్థిత వామపాదమ్, పాదోదరాలంకృత యోగపట్టమ్ ।
అపస్మృతే రాహిత పాదమంగే, ప్రణౌమి దేవం ప్రణిధానవంతమ్ ॥ 7

తా॥ నడుము నుండి పాదముల పర్యంతము జీరాడు పులితోలు ధరించి కూర్చుండి, కుడి మోకాలిపైకి మడిచిన యెడమ పాదము ధ్యాన పారవశ్యమున నిలువక క్రిందకు జారిపోవుచుండగా, యోగలక్షణములలో నొక్కటియగు ఈశ్వరప్రణిధానము (భగవంతునియందు మనస్సు నిలుపుట ) ననుష్ఠించు శ్రీ దక్షిణామూర్తిస్వామివారికి భక్తితో ప్రణమిల్లెదను.

శ్లో॥ తత్త్వార్థ మన్తేవసతా మృషీణాం, యువాఽపి య స్స న్నుపదేష్టు మీష్టే ।
ప్రణౌమి తం ప్రాక్తన పుణ్యజాలై, రాచార్య మాశ్చర్య గుణాధివాసమ్ ॥ 8

తా॥ ఆత్మతత్త్వము నభ్యసించు ముదుసలి ఋషులకు యువకుడై యుండియు ఎవరు దానిని లెస్సగా నుపదేశింప సమర్థులో అట్టి అద్భుతగుణముల కాలవాలమైన ఆదిగురువు శ్రీ దక్షిణామూర్తి స్వామివారికి నా పూర్వ సుకృతముల ఫలముగా నమస్కరింపగల్గుచున్నాను.

శ్లో॥ ఏకేన ముద్రాం పరశుం కరేణ, కరేణ చాఽన్యేన మృగం దధానః ।
స్వజాను విన్యస్త కరః పురస్తా, దాచార్య చూడామణి రావిరస్తు ॥ 9

తా॥ ఒక చేత పరశువును (గొడ్డలిని), మరియొక చేత లేడిని ధరించి, మోకాలిపై బాహువును మోపి కూర్చున్న ఆచార్య చూడామణి శ్రీ దక్షిణామూర్తిస్వామివారు నా యెట్టెదుట సాక్షాత్కరించెదరు గాక !



శ్లో॥ ఆలేపవన్తం మదనాంగ భూత్యా, శార్దూల కృత్త్యా పరిధానవంతమ్ ।
ఆలోకయే కంచన దేశికేంద్ర, మజ్ఞాన వారాకర బాడబాగ్నిమ్ ॥ 10

తా॥ తాను దహించిన మన్మథుని యొక్క చితాభస్మమును మేన అలందుకొన్నవాడును, పులితోలు చుట్టుకొన్నవాడును, అజ్ఞానమనెడి సముద్రమును ఆవిరి చేయగల బడబాగ్ని వంటివాడును ఐన ఒకానొక లోకోత్తర సద్గురు శ్రేష్ఠుని నేనిప్పుడు దర్శించుచున్నాను.

శ్లో॥ చారు స్థితం సోమ కళావతంసం, వీణాధరం వ్యక్త జటా కలాపమ్ ।
ఉపాసతే కేచన యోగిన స్త్వా, ముపాత్త నాదానుభవ ప్రమోదమ్ ॥ 11

తా॥ హే దక్షిణామూర్తిస్వామీ! నెలవంకను తలమానికముగా జేసికొని, జడలే పూలదండలై వ్రేలాడుచుండగా సొగసుగా కూర్చుండి, వీణ వాయింపుచు ఆ నాదబ్రహ్మానుభవపు ఆనం దమును ఆస్వాదించునట్టి నిన్ను కొంతమంది అదృష్టవంతులైన యోగులు మాత్రమే ఉపాసింపజాలుదురు సుమా !

శ్లో॥ ఉపాసతే యం మునయ శ్శుకాద్యాః , నిరాశిషో నిర్మమతాధివాసాః ।
తం దక్షిణామూర్తి తనుం మహేశ, ముపాస్మహే మోహ మహార్తి శాంత్యై ॥ 12

తా॥ శుభాశుభ వివర్జితులును, మమకారములు లేని స్థితి నధివసించువారును అగు శ్రీ శుకాది ప్రముఖ మునివర్యులు ఎవరిని ఉపాసించెదరో, అట్టి దక్షిణామూర్తిగా అవతారము దాల్చివచ్చిన మహేశ్వరునే మేమును మా అజ్ఞాన దుఃఖోపశమనమునకై ఉపాసించెదము.

శ్లో॥ కాంత్యా నిందిత కుంద కందళ వపుర్- న్యగ్రోధ మూలే వసన్
కారుణ్యామృత వారిభిర్ మునిజనం-సంభావయన్ వీక్షణైః ।
మోహ ధ్వాంత విభేదనం విరచయన్- బోధేన తత్తాదృశో
దేవ స్తత్త్వమసీతి బోధయతు మాం-ముద్రావతా పాణినా ॥ 13

తా॥ తన తెలతెల్లని దేహకాంతితో మల్లెమొగ్గలను సైతము తృణీకరించుచు, తన కండ్ల నుండి వెలువడుచున్న కరుణ అను అమృతధారలతో మునులను ముంచెత్తి, తన తత్త్వోపదేశముచేత వారి అజ్ఞానపు చీకట్లను పటాపంచలు సేయజాలిన పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీ దక్షిణామూర్తి స్వామివారు చేయెత్తి, నా కభయమొసగి 'తత్త్వమసి' ఇత్యాదిగా గల అద్వైత వేదాంత మహావాక్యములను బోధించెదరు గాక !

శ్లో॥ అగౌర గాత్రై రలలాట నేత్రై , రశాంత వేషై రభుజంగ భూషైః ।
రబోధ ముద్రై రనపాస్త నిద్రై , రపూర్ణ కామై రమరై రలం నః ॥ 14

తా॥ తెల్లని శరీరములు (పవిత్రత) లేనివారును, నుదుట (జ్ఞాన) నేత్రము లోపించినవారును, (అహంకార, మమకారములచే) ప్రసన్నరూపము కొరవడినవారును, పాములను మెడలో వేసికొనలేనివారును (చావును జయింపలేనివారును), చేతులతో అజ్ఞానపు ముద్రలు పట్టువారును, నిద్రను (అజ్ఞానమును) జయింపలేనివారును, కోరికలు నిండుకొననివారును అగు వివిధాకారముల ఇతర దేవతలింక మాకు వలదు. మాకు పవిత్ర జ్ఞానస్వరూపుడైన శ్రీ దక్షిణామూర్తిస్వామివారొక్కరే కావలెను.

శ్లో॥ దైవతాని కతి సంతి చావనౌ, నైవ తాని మనసో మతాని మే ।
దీక్షితం జడధియా మనుగ్రహే, దక్షిణాభిముఖమేవ దైవతమ్ ॥ 15

తా॥ ప్రపంచములో దేవతలెందరు లేరు గనుక ? వారెవ్వరును నా మనస్సునకు నచ్చినవారు కారు. మనవంటి మూఢులను జ్ఞానోపదేశముచేత అనుగ్రహించుటకు దీక్షబూనిన శ్రీ దక్షిణామూర్తిస్వామివారొక్కరే నిజమైన దేవుడు.

శ్లో॥ ముదితాయ ముగ్ధ శశినా వతంసినే, భసితావలేప రమణీయ మూర్తయే ।
జగదింద్రజాల రచనా పటీయసే, మహసే నమోఽస్తు వటమూల వాసినే ॥ 16

తా॥ చవితి చంద్రుని శిరోమణిగా దాల్చినవాడును, భస్మపు మైపూతచే మనోహరమైనవాడును, సృష్టి స్థితి లయములనెడి గారుడీ విద్యలో అఖండుడును, అప్పసము మర్రిచెట్టు క్రింద ఆసీనుడై యుండువాడును, మా పట్ల ప్రసన్నుడును అగు శ్రీ దక్షిణామూర్తిస్వామివారనెడి మహత్ తేజో మండలమునకు మా నమస్కారములు చెందు గాక !

శ్లో॥ వ్యాలంబినీభిః పరితో జటాభిః, కళావశేషేణ కళాధరేణ ।
పశ్యల్లలాటేన ముఖేందునా చ, ప్రకాశసే చేతసి నిర్మలానామ్ ॥ 17

తా॥ హే దక్షిణామూర్తిస్వామీ ! మమకారములు లేక నిన్నే ఉపాసించు నీ భక్తులకు నీవు తల చుట్టుత వ్రేలాడు జడలతోను, శిరస్సుపై నెలకొన్న నెలవంకతోను, మూడవ కంటితో విలసిల్లు ముఖచంద్రునితోను ధ్యానమునందు భాసించెదవు కదా !

శ్లో॥ ఉపాసకానాం త్వ ముమాసహాయః , పూర్ణేందు భావం ప్రకటీకరోషి ।



యదద్య తే దర్శన మాత్రతో మే, ద్రవత్యహో మానస చంద్రకాంతః ॥ 18

తా॥ హే దక్షిణామూర్తిస్వామీ ! నీ దర్శనమాత్రముచేతనే నా మనస్సనెడి చంద్రకాంతమణి (భక్తి పారవశ్యముతో) కరగి నీరగుచున్నందువలన పార్వతీ సమేతుడవైన నీవే ఉపాసకుల పాలిట అమృత కిరణుడవు (చంద్రుడవు) అని వెల్లడించుచున్నావు.

**విశేషము :**

*1. అమృత కిరణుడు :* చంద్రుడని నైఘంటికార్థము. 'అమృతత్వమును– అనగా, మోక్షమును ప్రసాదించు తేజస్సుగలవాడవు' అని ప్రకరణ గతార్థము.

*2. మానస చంద్రకాంతము :* చంద్రకాంతమణి వెన్నెల సోకినప్పుడును, అట్లే సూర్యకాంతమణి యెండ సోకినప్పుడును కరగునని కవి సమయము.

**: ఫలశ్రుతి :**

శ్లో॥ య స్తే ప్రసన్నా మనుసందధానో, మూర్తిం ముదా ముగ్ధ శశాంక మౌళేః ।
ఐశ్వర్య మాయుర్ లభతే చ విద్యా , మన్తే చ వేదాంత మహా రహస్యమ్ ॥ 19

తా॥ హే దక్షిణామూర్తిస్వామీ ! చవితి చంద్రుని శిరస్సున దాల్చిన నీ ప్రసన్నమూర్తిని ఎల్లప్పుడును ఆనందముగా ధ్యానించువాడు ఆయురారోగ్యైశ్వర్యములను, విద్యాబుద్ధులను మాత్రమే కాక, అంత్యకాలమునందు బ్రహ్మవిద్యారహస్యముల ఎరుకను సైతము పొందగలడు.

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతం దక్షిణామూర్తి స్తోత్రమ్ ॥

( ఏడవదైన గంగాష్టకము కొరకు తొమ్మిదవదైన కృష్ణాష్టకము తరువాత చూడుడు)

# 7. గంగాష్టకమ్

శ్లో॥ భగవతి ! తవ తీరే నీర మాత్రాశనోఽహం
విగత విషయ తృష్ణః కృష్ణ మారాధయామి ।
సకల కలుష భంగే ! స్వర్గ సోపాన సంగే !
తరళతర తరంగే ! దేవి ! గంగే ! ప్రసీద ॥ 1

తా॥ భక్తుల యొక్క అన్ని పాపములను పోగొట్టి , స్వర్గపు మెట్లతో వారికి సంబంధమును గూర్చునట్టి పొంగారు (స్వర్గమంత యెత్తున లేచు) కెరటములు గల ఓ దేవీ ! గంగానదీ ! విషయ వాంఛలను వీడి, నీ ఒడ్డున నివసించుచు, నీ నీటిని మాత్రమే ఆహారముగా గైకొనుచు (ఉపవసించుచు) శ్రీహరిని ఉపాసించుచున్నాను. కనుక, నాయందు ప్రసన్నురాలవు కమ్ము. (ఏలన, నీవు ఆయన యొక్క పాదములనుండి ప్రభవించి, విష్ణుపదీ అను నామమున ప్రసిద్ధి చెందితివి గదా ! అని కవి హృదయము)

శ్లో॥ భగవతి ! భవలీలా మౌళిమాలే ! తవాంభః
కణమణు పరిమాణం ప్రాణినో యే స్పృశంతి ।
అమర నగర నారీ చామర గ్రాహిణీనాం
విగత కలి కళంకాతంక మంకే లుఠంతి ॥ 2

తా॥ శివుడు వేడుకగా ధరించిన పూలమాలవలె ఆయన శిరము నలంకరించిన ఓ దేవీ ! గంగానదీ మతల్లీ ! కలికాలపు దోషములకు భీతిగొల్పు నీ నీటిచుక్క అణుమాత్రమైనను స్పృశించు భాగ్యమబ్బిన మానవులు (మరణానంతరము) స్వర్గలోకపు అప్సరసల ఒడిలో పొర్లుటకు నోచుకొందురు కదా !

శ్లో॥ బ్రహ్మాండం ఖండయంతీ హర శిరసి జటావల్లి ముల్లాసయంతీ
స్వర్లోకా దాపతంతీ కనకగిరి గుహాగండ శైలాత్ స్ఖలంతీ ।
క్షోణీపృష్ఠే లుఠంతీ దురిత చయ చమూర్ నిర్భరం భర్త్సయంతీ
పాథోధిం పూరయంతీ సుర నగర సరిత్ పావనీ నః పునాతు ॥ 3

తా॥ ఆకాశమునుండి ధారగా పడుచు, అప్పుడు విశ్వమును తనకు రెండువైపుల రెండు సమభాగములుగా విభజించుచు, అదే సమయమున శివుని జటాజూటమును ముంచెత్తి



తన చల్లదనముతో అభిషేక ప్రియుడైన ఆయనకు ఆహ్లాదమును కలిగించుచు, పిదప మేరుపర్వతపు గుహలలోని బండరాళ్ళ మీదుగా ఎగసిపడుచు, భూమి ఉపరితలముపై బిరబిరా దొరలుచు, కట్టకడపట తన పవిత్రతతో సముద్రమును నింపునట్టి స్వర్లోకపు నది శ్రీ గంగాదేవి మమ్ములను సైతము పవిత్రులుగా చేయు గాక !

శ్లో॥ మజ్జన్మాతంగ కుంభ చ్యుత మద మదిరా మోద మత్తాళి జాలం
స్నానై స్సిద్ధాంగనానాం కుచ యుగ విలసత్కుంకుమాసంగ పింగం ।
సాయం ప్రాతర్ మునీనాం కుశ కుసుమ చయై శ్ఛన్న తీరస్థ నీరం
పాయా న్నో గాంగ మంభః కరి కలభ కరాక్రాంత రంగ స్తరంగమ్ ॥ 4

తా॥ తనయందు మునుకలు వేయు మగ యేనుగుల కుంభస్థలముల నుండి స్రవించు మద జలపు వాసనకు మూగిన తుమ్మెదల దండు కలిగినదియు, గున్నయేనుగుల చిన్నారితొండములచే ఆక్రమింపబడిన ఉపరితలము గలదియు, తనయందు సిద్ధాంగనలు స్నానమాడగా, వారి చనుగవలపై మకరికా పత్ర రచనలు వ్రాయుట కుపయోగించిన కుంకుమ కరగి, నీటిలో కలిసి ఎర్రెర్రని వన్నె తేలునదియు, ప్రొద్దున మరియు సాయంకాలము తనయందు క్రుంకులిడి తనను పూజింపవచ్చు మునులు అర్పించిన దర్భపుల్లలతోను, పూలతోను కప్పబడి కానరాకుండు ఒడ్డుదగ్గరి నీరు గలదియు నైన పవిత్ర గంగాతరంగము మమ్ము రక్షించు గాక !

**విశేషము :**

సిద్ధాంగనలు : ఇది ఇక్కడ 'మంత్రసిద్ధులు' లేదా 'తపస్సిద్ధులు' అను అర్థమున వాడం
బడిన పదము కాదు. మానవజన్మ కంటె మేల్తరమైన దివ్యజన్మలలో సిద్ధజన్మ కూడ ఒకటి. వీరి కోవకు చెందినవారే విద్యాధరులు, గంధర్వులు, కిన్నరులు, పిశాచులు మున్నగువారు.

శ్లో॥ విద్యాధరోఽప్సరో యక్ష రక్షో గంధర్వ కిన్నరాః ।
పిశాచో గుహ్యక స్సిద్ధో భూతోఽమీ దేవయోనయః ॥ *–(అమరకోశము I/10)*

దివ్యులు సైతము గంగాస్నాన నిమిత్తమై తమతమ లోకములను వీడి కాశీకి వచ్చెదరని కని భావము.

శ్లో॥ ఆదా వాది పితామహస్య నియమ వ్యాపార పాత్రే జలం
పశ్చాత్ పన్నగ శాయినో భగవతః పాదోదకం పావనమ్ ।

భూయ శ్శంభు జటా విభూషణ మణిర్ జహ్నోర్ మహర్షే రియం
కన్యా కల్మషనాశినీ భగవతీ భాగీరథీ దృశ్యతే ॥ 5

తా॥ ఆహా ! పాపములను పోకార్చు ఈ గంగానది తొలుత బ్రహ్మదేవుని కమండలము నందలి ఆచమన జలముగా నుండెడిది. పిదప శ్రీ మహావిష్ణువుయొక్క పాదములను కడుగుటకు ఉపయోగించిన పావన పాద్యమయ్యెను. ఆమెయే ఆపై సదాశివుని జడలమధ్య తురుముకొనబడిన చూడామణి అయ్యెను. ఆమెయే అనంతరము జహ్ను మహర్షిచే త్రాగి విడువబడి, ఆయన కూతురై, జాహ్నవి అని పేర్గాంచెను. అట్టి పురాణమూర్తి శ్రీ భాగీరథీ అమ్మవారు కట్టెదుటనే కన్పించుచున్నది కదా ! ఏమి మన అదృష్టము !

శ్లో॥ శైలేంద్రా దవతారిణీ నిజజలే మజ్జజ్జనోత్తారిణీ
పారావార విహారిణీ భవ భయ శ్రేణీ సముత్సారిణీ ।
శేషాహే రనుకారిణీ హర శిరోవల్లీ దళాకారిణీ
కాశీప్రాంత విహారిణీ విజయతే గంగా మనోహారిణీ ॥ 6

తా॥ శివుని శిరస్సునుండి తీగవలె ప్రాకివచ్చి , హిమాలయము మీదుగా దిగి, కాశీప్రాంతమునకు వేంచేసి, తనయందు మజ్జనమాడు సజ్జనులను తరింపజేయుచు, మన సంసారపు దుఃఖములను పారద్రోలునదై , ఆదిశేషుని పడగలవలె ఉవ్వెత్తున ఎగసిపడు కెరటములతో సముద్రము వైపుగా సాగిపోవు మనోహర నదీ మతల్లి శ్రీ గంగాదేవికి జేజేలు.

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతం గంగాష్టకమ్ ॥



# 8. శివ పంచాక్షరీ స్తోత్రమ్

శ్లో॥ నాగేంద్రహారాయ త్రిలోచనాయ, భస్మాంగ రాగాయ మహేశ్వరాయ ।
నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ, తస్మై నకారాయ నమశ్శివాయ ॥ 1

తా॥ పాముల రాజైన ఆదిశేషుని తన మెడలో హారముగా ధరించినవాడును, మూడు కండ్ల తో నచూచువాడును, బూడిదయే మైపూతగా అలందుకొన్నవాడును, శాశ్వతుడును, పరిశుద్ధుడును, జీవావరణములు లేని కేవలుడును, పంచాక్షరీమంత్రమునందలి **'న'** కార స్వ రూపుడును అగు సదాశివ పరమేశ్వరునికి నమస్కారము.

శ్లో॥ మందాకినీ సలిల చందన చర్చితాయ, నందీశ్వర ప్రమథనాథ మహేశ్వరాయ ।
మందార పుష్ప బహుపుష్ప సుపూజితాయ, తస్మై మకారాయ నమశ్శివాయ ॥ 2

తా॥ గంగాజలముతో కలిపి తీసిన గంధమును మేన అలందుకొన్నవాడును, నందీశ్వరుడు మున్నగు ప్రమథుల కధినాథుడును, మందారము మొదలుగా గల పలుపుష్పములతో లెస్సగా పూజింపబడువాడును, పంచాక్షరీమంత్రమునందలి **'మ'**కార స్వరూపుడును అగు సదాశివ పరమేశ్వరునికి నమస్కారము.

శ్లో॥ శివాయ గౌరీ వదనాబ్జ భృంగ, సూర్యాయ దక్షాధ్వర నాశనాయ ।
శ్రీ నీలకంఠాయ వృషధ్వజాయ, తస్మై శికారాయ నమశ్శివాయ ॥ 3

తా॥ పార్వతీదేవి యొక్క ముఖమనెడి పద్మము చుట్టు తిరుగు తుమ్మెదవంటివాడును, ఆ పద్మమును తన చూపులనెడి ఉషః కిరణములతో వికసింపజేయు సూర్యునివంటివాడును, దక్షప్రజాపతి యొక్క యజ్ఞమును ధ్వంసము చేసినవాడును, హాలాహలమును మ్రింగుట వలన కంఠము నల్లబడినవాడును, తన టెక్కెము (జెండా) నందు నందీశ్వరుని చిహ్నము గలవాడును, పంచాక్షరీమంత్రమునందలి **'శి'** కార స్వరూపుడును అగు సదాశివ పరమేశ్వరునికి నమస్కారము.

శ్లో॥ వశిష్ఠ కుంభోద్భవ గౌతమాద్య , మునీంద్ర దేవార్చిత శేఖరాయ ।
చంద్రార్క వైశ్వానర లోచనాయ, తస్మై వకారాయ నమశ్శివాయ ॥ 4

తా॥ వశిష్టుడు, అగస్త్యుడు, గౌతముడు మొదలైన గొప్పగొప్ప మునులచే (అభిషేకము ద్వారా) అర్చింపబడిన శిరస్సుగలవాడును, సూర్యచంద్రులును, అగ్నిదేవుడును తన మూడు కండ్లుగా గలవాడును, పంచాక్షరీ మంత్రమునందలి **'వ'** కార స్వరూపుడును అగు సదాశివ పరమేశ్వరునికి నమస్కారము.

శ్లో॥ యక్ష స్వరూపాయ జటాధరాయ, పినాక హస్తాయ సనాతనాయ ।
దివ్యాయ దేవాయ దిగంబరాయ, తస్మై యకారాయ నమశ్శివాయ ॥ 5

తా॥ తన మిత్రుడైన కుబేరుడనెడి యక్షరాజు రూపమున తానే ధనములను ప్రసాదించువాడును, జడలు పెంచుకొన్నవాడును, పినాకమనెడి విల్లుని చేత దాల్చినవాడును, సనాతనుడును, మహిమోపేతుడును, జీవావరణములు లేని కేవలుడును, పంచాక్షరీమంత్రమునందలి **'య'** కార స్వరూపుడును అగు సదాశివ పరమేశ్వరునికి నమస్కారము.

: ఫలశ్రుతి :

శ్లో॥ పంచాక్షరీ మిమాం పుణ్యాం యః పఠేత్ శివసన్నిధౌ ।
శివలోక మవాప్నోతి శివేన సహ మోదతే ॥ 6

తా॥ పవిత్రమైన యీ శివపంచాక్షరీస్తోత్రమును ప్రతిదినమును సదాశివుని సమక్షమున కూర్చుండి పారాయణ చేయువాడు మరణానంతరము శివలోకమునకు చేరుకొని, శ్రీశివ సాయుజ్యమును పొంది సుఖించును.

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతం శివ పంచాక్షరీ స్తోత్రమ్ ॥



# 9. శ్రీ కృష్ణాష్టకమ్

శ్లో॥ భజే వ్రజైక మండనం సమస్త పాప ఖండనం
స్వభక్త చిత్త రంజనం సదైవ నందనందనమ్ ।
సుపింఛ గుచ్ఛ మస్తకం సునాద వేణు హస్తకం
అనంగ రంగ సాగరం నమామి కృష్ణ సాగరమ్ ॥ 1

తా॥ వ్రేపల్లెకే భూషణమైనవాడును, పాపములన్నింటిని చీల్చి చెండాడువాడును, తన భక్తుల మనస్సులను అలరించువాడును అగు నందకిశోరుని ఎల్లప్పుడును భజించెదను. అందమైన నెమలి పింఛముల గుత్తి నలంకరించిన శిరస్సు గలవాడును, సొంపుగా మ్రోయు పిల్లనగ్రోవిని చేత ధరించినవాడును, శృంగార రసమునకు సముద్రమువంటివాడును అగు ఆ శ్రీకృష్ణునికి నమస్కారము.

శ్లో॥ మనోజ గర్వ మోచనం విశాల లోల లోచనం
విధూత గోప శోచనం నమామి పద్మ లోచనమ్।
కరారవింద భూధరం స్మితావలోక సుందరం
మహేంద్ర మాన దారణం నమామి కృష్ణ వారణమ్ ॥ 2

తా॥ మన్మథుని గర్వమునే వదలగొట్టునంతటి లోకోత్తర సౌందర్యాధిక్యము గలవాడును, అటునిటు కదలాడు పద్మములవంటి వెడల్పాటి కన్నులు గలవాడును, గొల్లవారి బాధలను పోగొట్టినవాడును అగు వాసుదేవునికి నమస్కారము. గోవర్ధన పర్వతమును తన చేతియందు మోసినవాడును, దేవేంద్రుని అహంకారమును అణచివేసినవాడును, చిరునగవుతో కూడిన చూపులతో సుందరమైనవాడును అగు శ్రీకృష్ణునికి నమస్కారము.

శ్లో॥ కదంబ సూన కుండలం సుచారు గండ మండలం
వ్రజాంగనైక వల్లభం నమామి కృష్ణ దుర్లభమ్ ।
యశోదయా సమోదయా సగోపయా సనందయా
యుతం సుఖైక దాయకం నమామి గోప నాయకమ్ ॥ 3

తా॥ కడిమి పూవును చెవియందు దాల్చినవాడును, సొగసైన చెక్కిళ్ళు గలవాడును, వ్రేతలకు మిక్కిలి కూర్చువాడును, జపధ్యాన యోగ యాగాది అనుష్ఠానములకు సైతము అంద

రానివాడును అగు శౌరికి నమస్కారము. భర్తయైన నందునితో కలిసి ఆనందించునట్టి తన తల్లి శ్రీయశోదాదేవి దగ్గర ఇతర గోపబాలకులతో పాటు కూర్చుండి వారికి హాయిని గూర్చు శ్రీబాలగోపాలనాథునికి నమస్కారము.

శ్లో॥ సదైవ పాద పంకజం మదీయ మానసేఽనిశం
దధాన ముత్తమాలకం నమామి నందబాలకమ్ ।
సమస్త దోష శోషణం సమస్త లోక పోషణం
సమస్త గోప మానసం నమామి నందలాలసమ్ । 4

తా॥ అందమైన ముంగురులు గల నంద బాలకుని పాద పద్మములకు ఎల్లప్పుడును మనస్సున నమస్సు లర్పించెదను. అన్ని విధములైన దోషములను హరించువాడును, అన్ని లోకములను సాకువాడును, గోపాలకులందరి మనస్సులలోను నెలకొన్నవాడును అగు శ్రీకృష్ణునికి వంద నము లాచరించెదను.

శ్లో॥ భువో భరావతారకం భవాబ్ధి కర్ణ ధారకం
యశోమతీ కిశోరకం నమామి చిత్త చోరకమ్ ।
దృగంత కాంత భంగినం సదా సదాలసంగినం
దినే దినే నవం నవం నమామి నంద సంభవమ్ ॥ 5

తా॥ భూమి యొక్క భారమును తగ్గించువాడును, సంసారమనెడి కడలి దాటించు ఓడకు తండేలు (captain) వంటివాడును అయి, లోకుల మనస్సులను హరించు యశోదాదేవి ముద్దుల పట్టికి నమస్కారము. తన చూపులతోనే మృత్యువును అంతమొందించు నంద కిశో రునికి నమస్కారము.

శ్లో॥ గుణాకరం సుఖాకరం కృపాకరం కృపాపరం
సుర ద్విష న్నికందనం నమామి గోప నందనం ।
నవీన గోప నాగరం నవీన కేళి లంపటం
నమామి మేఘ సుందరం తటిత్ ప్రభా లసత్ పటమ్ । 6

తా॥ అన్ని సద్గుణములకును నిలయమైనవాడును, అన్ని సుఖములకును పెన్నిధియైనవా డును, దయజూపువాడును, దయయే తన అపర స్వభావముగా గలవాడును, రాక్షసులను హతమార్చువాడును అగు గోపాల బాలకునికి నమస్కారము. కొంగ్రొత్త ఆటలాడుట



యందు మక్కువ గల నవ నాగరికుడైన గోపాల బాలునికి నమస్కారము. మెరుపుల కాంతివలె తెల తెల్లని వస్త్రములను ధరించిన నీలమేఘశ్యామునికి వందనము.

శ్లో॥ సమస్త గోప నందనం హృదంబుజైక మోహనం
నమామి కుంజ మధ్యగం ప్రసన్న భాను శోభనమ్ ।
నికామ కామ దాయకం దృగంత చారు సాయకం
రసాల వేణుగాయకం నమామి కుంజ నాయకమ్ ॥ 7

తా॥ గోపాలకులకు ఆనందమును గూర్చువాడును, హృదయములను మోహింపజేయువాడును, పొదరింట ప్రొద్దుటి సూర్యునివలె ఆహ్లాదమును గల్గించువాడును కోర్కెలను లెస్స గా తీర్చువా డును, తన కటాక్షములనే అందమైన బాణములుగా జేసి వదలువాడును, పిల్లనగ్రోవిని రసవత్తర ముగా పలికించు పొదరింటి రేడును అగు శ్రీకృష్ణునికి నమస్కారము.

శ్లో॥ విదగ్ధ గోపికా మనో మనోజ కల్ప శాయినం
నమామి కుంజ కాననే ప్రవృద్ధ వహ్ని పాయినమ్ ।
యదా యదా తథా తథా తదైవ కృష్ణ సత్కథా
మయా సదైవ గీయతాం తథా కృపా విధీయతామ్ ॥ 8

తా॥ ప్రౌఢలైన గొల్ల స్త్రీల మనస్సులందు మన్మథునివంటివాడై నిదురించువాడును, పొదరిళ్ళ యందు రగుల్కొన్న కార్చిచ్చు నుండి వారిని కాపాడువాడును అగు శ్రీకృష్ణునికి నమస్కారము. ఈ విధముగానే ఎప్పుడంటే అప్పుడు నేను తన సత్కథను గానము చేయునట్లు ఆయన కృపసేయు గాక !

**: ఫలశ్రుతి :**

శ్లో॥ ప్రమాణికాష్టక ద్వయం జపత్యధీత్య యః పుమాన్ ।
భవేత్ స నందనందనే భవే భవే సుభక్తిమాన్ ॥ 9

తా॥ ఈ కృష్ణాష్టకమునందు రెండు శ్లోకములైనను ప్రతిరోజు పారాయణచేసి మననము చేయువారు ప్రతి జన్మమునందును శ్రీకృష్ణునికి భక్తులగుదురు.

॥ ఇతి శ్రీ శంకర భగవత్పాద కృతం శ్రీకృష్ణాష్టకమ్ ॥